చిన్నకథ:

# శ్రీను

శ్రీ పులిపాక
జగన్నాథరావు

నిత్యం వున్నంతలో సంతృప్తికి, గాంభీర్యానికి, చిట్టచివరకు ఆనందానికి శ్రీపురానికి యేవో పవిత్రమైన సిద్ధహస్తాలు పునాదిరాతిని బలంగా వేసినట్లున్నాయి. లేకపోతే ఆ పురంలోని మనుష్యులంతా ఆలా తమపైకి యెన్నికష్టాలువచ్చినా యేమొచ్చిమీద పడ్డా చీకూచింతా లేకుండా వుండటమేమిటి ? కష్టాలకు వాళ్లు చలించరన్న ముక్కకు మరి నేను ఆశ్చర్యపడటంలేదు. కాని వాళ్ళు చక్కగా ఆ 'కష్ట' మన్న పదమే తమకోసంతాము యెవరికివారు యెరగమన్నట్లు సంచరిస్తారాయెను ! మరి ఆశ్చర్యంగా లేదూ !

మచ్చుకు యిక్కడ సీను అనేవ్యక్తి జీవితాన్ని మూడుముక్కలలో చెబుతాను. ఇదొక్కటి చెబితే శ్రీపురంలోని జీవితాలన్నిటి గూర్చి చూచాయగా చెప్పినట్లేను. మరి మీ అమూల్యమైన కాలాన్ని పాడుచెయ్యక మూడుముక్కలలో తేల్చివేస్తాను.

చిన్నతనపు ఆఖరిక్షణాలలో అంటే పద్ధాలుగు యేళ్ళప్పుడు సీను కోతికొమ్మచ్చిఆటలో కాలు బెణకకొట్టుకొని కుంటుకుంటూ యింటికివస్తున్నాడు. వీధి మలుపులో మనమణ్ణి కుంటుతూచూడగానే వాళ్ళ నాయనమ్మ ఆవురుమంటూ శోకాలు మొదలుపెట్టింది. తరువాత కాలు మామూలుదశకు రావడానికి సుమారుగా ఒక నెల పట్టింది. నెలపట్టినా రెండునెలలుపట్టినా యెవరికొక్కవాలి ! కాని అది పూరకేపోలేదు. చాలా బాధపెట్టింది సీనును నిజానికి. కాని ఆ అబ్బాయి అదేమీ వ్యక్తంచేయలేదు. 'ఇప్పుడు భూకంపం యేమీరాలేదుకదా, దేనికీగోల' అన్నాడు అతను పదేపదే ముసలిదాన్ని చూసి నవ్వుతూ.

ఆపైన యిరవైయేళ్లకు సీను అటు మనకు ఎం.ఏ.లాంటి పరీక్షను, ఇటు శరీరాన్ని పాడుచేసుకున్నాడు. శరీరాన్ని పాడుచేసుకున్నాడంటే మరేమో మీరు అపార్థాలు తీశేరు ! అంటే తన చదువులో సహాధ్యాయిని యెవరినో ప్రేమించాడు ! మరి ఆ దరిద్రపుమనిషి యెవరో ! లేకపోతే అంత అందచందాలు, చదువుసంధ్యలు, సంగీతసాహిత్యాలు, ధనధాన్యాలు మరి యితర గుణగణాలు గల సీనును నిరాకరించడమేమిటి ? నేనుకాబట్టి నాకు ఆ మనిషి పేరు తెలిసినా మెదలక వూరుకున్నాను కాని మీరయితే తప్పక వెదకటంలో, దాటవల్సివస్తే సప్తసముద్రాలనైనా దాటి మీ రివాల్వారుతో కాల్చివేసి వుండరూ ! వెదకటం, కాల్చివెయ్యటం, వెయ్యకపోవటం ప్రశ్నలు అలా అట్టేపెడదాము; ఇంతకూ చెప్పవచ్చేదేమంటే సీను అలా మనోవ్యాధితో శరీరాన్ని నాశనం చేసుకున్నాడంటున్నాను, పరీక్ష తప్పి కూర్చున్నాడంటున్నాను.

సీను చాలా తెలివితేటలుగలవాడు. ఇదే అందరి అభిప్రాయమూను. అటువంటప్పుడు అతని పరీక్ష పోవటమేమిటి ? ఇదే ఆబాలగోపాలమూ పిన్నాపెద్దా పండితపామరులూ అనుకున్న విషయం. పోనీ కుర్రవాడైనా సరిగా వచ్చాడూఅంటే అదీ లేదాయెను ! నిక్షేపంలాంటి సీను చిక్కిపోయి కళ్లల్లో ప్రాణాలుపెట్టుకుని కనిపిస్తున్నాడు. పాడుప్రేమ ! అది యిలా మనిషిని నాశనంచేయగలదా ! కాదు, కాదు...పొరబాటు, సీనుది విఫలప్రేమకదూ ! అవును ! ఇప్పుడు తెలిసింది. విఫలప్రేమ మనిషిని నాశనంచేయగలదు. మరి ఫలించిన ప్రేమమాట ? పోనిద్దురూ ! మనకెందుకు దానివిషయం ! మన సీను ప్రేమ యేమైనా ఫలించిందికనుకనా ! ఉట్టుటి

ప్రయోజనరహితమైన అనవసర విషయాలజోలి మనకెందుకు? ఫలించే ప్రేమా! నీకొక సలాము. నా విషయమై ఆలోచించండి అంటూ మా వూహాలలోకి రావద్దు. జావ్, జావ్...

సీను పంచప్రాణాలు కళ్ళల్లో పెట్టుకొని కనిపిస్తున్నాడనికదూ చెబుతున్నది? అవును! లేకపోతే అదేమిటి? ఎప్పుడూ పచ్చపచ్చగా నవ్వుతూ కళకళలాడుతూవుండే సీను యిలా పలకక గాంభీర్యంగా వున్నాడేమిటి? ఒక్కడుగా వున్నప్పుడు అతనికళ్ళల్లో అలా కన్నీరు తిరుగుతుందేమిటి?

సీనుకు పెద్ద జబ్బుచేసింది. జాతకుడు యిలా 'అవును! వెనుక యెప్పుడో నేను చెప్పాను, ఇది చాలా పెద్దగండం' అన్నాడు.

'యముడితో పోట్లాడుతున్నాను' అన్నాడు వైద్యుడు.

'ఆ మనిషి యెవరో! ఆమెను పిలిపిస్తే ఒక్క క్షణంలో తేలిపోదూ' అన్నారు మన శాస్త్రవేత్తలు.

కాని అదేమాట! అదేనవ్వు! సీనుయెప్పుడూ అలాగేఅనేవాడు:—'ఇప్పుడు భూకంపం యేమీ రాలేదుకదా, దేనికీగోల' అని.

ఎలా నయమయిందో యెవరికీ తెలీదు. కాకపోయినా మనకెందుకు ఆ విషయం! నయమవ్వటమే కాని మనకు కావాల్సింది! బహుశ సీనే తన మనస్సులో పెళ్ళిచేసుకుని గృహస్తవుతే ఆ ప్రేమించిన మనిషిని మరిచిపోగలనని అనుకొనివుంటాడు. లేకపోతే మనోవ్యాధికి మందేమిటి? వ్యాధిగ్రస్తుడే తన హృదయాన్ని బాగుచేసుకోవాలి కాని!

మరీను! ఆపైనా ఆయన అన్ని శారీరక బాధలలోకి భరింపరానిది, మొట్టమొదటిదిఐన ఆకలిబాధతో కొన్నాళ్లు భార్యాబిడ్డలతో బాధపడినప్పుడూ యింతే! అప్పుడూ అదేపలుకును పలికేవాడు ఆయన తనను ఓదార్చవచ్చినవాళ్లతో!

అటుతరువాత ఇరవైఆరేళ్ల సీను చాలా కీర్తిప్రతిష్ఠలను, పేరుప్రఖ్యాతులను గణించాడు. ఈయన పద్యాలు చాలా చక్కనివని' కాకలుతీరిన విమర్శకులు, 'ఈయన పద్యాలు చక్కనివే' అని బడాబడా పెద్ద కవిపుంగవులు అన్నారు.

'ఈయన చిత్రాలలో జీవకళ వుట్టిపడుతూన్నది. ఈ గొప్పదనాన్ని వ్యక్తంచేయటానికి నిజానికి మాటలేమీ చాలవు' అని చిత్రరచనలోని నిపుణులైన విమర్శకులు అన్నారు. 'ఈయన చిత్రాలు చక్కనివేనని' ఈ సమకాలీకుని చిత్రకారులు ఒప్పుకున్నారు.

అలాగే పాటవిషయంలోకూడాను.

'అసలాయనకు చక్కని కంఠం వున్నది' అన్నారు, గొప్పదనాన్ని కంఠానికి యిచ్చి అరితేరిన గాయకులు.

'ఆయనకేం! ఆయనపాట విధికేవిరోధి.అంటే కష్టాన్ని ఒకడికి పూర్వజన్మ నిర్ణయిస్తే అతగాడు యీాయనపాటవింటే తన కష్టనష్టాలను, సమస్యలను అన్నింటినీ మరిచి స్వర్గంలో విహరిస్తాడు. తుంబురుడు, నారదుడు, ఆంజనేయుడు...వాళ్ల గానాన్ని ఔన్నత్యాన్ని మనం విన్నామేకాని చెవులతో విని ఆనందించే అదృష్టం మనకు కలగలేదు. అబ్బో, నిజానికి యీాయన పాటెక్కడ' అన్నారు విమర్శకులు.

ఏదియేమైనా, యెవరేమన్నా సీను గడువు ప్రపంచంలో ఐపోయింది. అవును! సీనుకు పిలుపు వచ్చింది.

ఇప్పుడు పత్నీపుత్రులు, తల్లితండ్రులే గాక ప్రపంచమంతా యీ అకాలపుఆత్మ వీడ్కోలుకు కన్నీరుపెడుతూన్నది. అందరూ వచ్చారు. సీను ప్రేమించిన మనిషికూడా వచ్చింది. ఆమెను చూసి సీను నవ్వాడు. ఆ నవ్వులో అతను తనతప్పుకు లజ్జతో తలవొగ్గటం కనిపించింది. 'నా చిన్నతనపు చిలిపితనానికి, అవివేకానికి, బలహీనతకు నాకే సిగ్గువేస్తున్నది. మీరు నన్ను క్షమించండి' అన్నాడు సీను సిగ్గుగా నవ్వుతూ. తరువాత ఆయన అదేపనిగా నవ్వుతూ...అదేమాట...అదేపలుకును పలికాడు. ఆయన మనస్సులో విచారమున్నదని నేను

తలచనైనా తలచలేను. ఆ క్షణాన అక్కడకు వచ్చిన అంతమంది ప్రాజ్ఞులలో మరెవ్వరూ అలా తలచలేదు. మరి మీరు నమ్మండి, నమ్మకపోండి,... మరీ మీదిఅంతా పిచ్చిగాని ఏమనిపైనా మనస్సులో విచారాన్ని అట్టేపెట్టుకుని అంత హృదయంతో నవ్వగలడా !

'ఇప్పుడు భూకంపం యేమీరాలేదుకదా, దేనికోల్' సీను యిలా నవ్వుతూ చాలాసార్లు అన్నాడప్పుడు.

పిచ్చివాడు ! కాకపోతే ఆయన చనిపోయిన తరువాత భూకంపంవస్తే ఆయనకెందుకు ? (భూకంపం రావాలని ఆయన అభిప్రాయం కాదనుకోండి) చక్కగా పచ్చగా పంటలుపండి భూమాత చక్కని చక్కదనంలోను, పచ్చని పచ్చదనంలోను, చల్లని చల్లదనంలోను నేత్రపర్వంచేస్తే ఆయనకెందుకు ? (పంటలుపండి కన్నుల పండువుచేయాలనే ఆయన అభిలాష, అభిమతం అనుకోండి. కాని నేననేదేమంటే వీటితో సీనుకు స్వప్రయోజనానికి యేమిటీ అని ? నేనప్పుడు తనకుమాలినధర్మం దేనికని ? నేను పొరబడి వుండవచ్చును. అలాగైనపక్షంలో మీరు మీ అనంతమైన కరుణలో నన్ను క్షంతవ్యునిగా జేయండని నా ప్రార్థన.)

సీను చనిపోతున్నాడని నీకెలా తెలుసూ అంటారూ ! అవ్వ ! ఆమాత్రం తెలీనటండీ ! ఆకళా కాంతులు క్షీణించిపోవటమూ, ఆ చేతులు వాలిపోవటమూ...

కాని మానవునికి హితబోధచేయగల ప్రకృతి మాత్రం అలాగే సుఖదుఃఖాలలోను, లాభాలాభాలలోను, జయాపజయాలలోను రాగద్వేషాలను బొందక సమానంగా వుంటూ నిర్వికారంగా వున్నది. (ప్రకృతిశాస్త్రరీత్యా యీమాట తప్పుకావచ్చును. కాని యిలా 'మంచి'ని వూహించటంలోను, చెప్పటంలోను నేర్చుకునే వుద్దేశం గలవారికి తప్పేమున్నది ?)

ఏమైనా సీను చక్కగా నవ్వుతూ అలా చనిపోయాడు.


## నేప్రిన్

దెబ్బలు, కురుపులు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్లు, మూలశంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్తచర్మం త్వరగా వచ్చేటందుకు సహాయపడుతుంది. ప్రతీయింటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

¼ ఔ. సీసా అణాలు 8. ½ ఔ. సీసా అణాలు 14.

## హొతెరిన

అతిసారానికి, జిగట, రక్త విరోచనాలకి
అద్భుతమైన ఔషధం.

అతిసారం, జిగట, రక్త విరోచనాలు, వాంతులు, జబ్బువల్ల వచ్చిన జ్వరం వీటిని తగ్గించును.

అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకెట్ 4 అణాలు.

## క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి.

ఎందుకంటే ఊపిరతిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలారాకుండా 'కాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయన్జా, మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకెట్టు 4 అణాలు.
అన్నిషాపులలోనూ దొరకును.

**The Lustre Manufacturing Co.,**
**Bangalore City.**